
స్వీట్‌గా ముంచేస్తోంది

- జిల్లాలో పెరుగుతున్న మధుమేహ బాధితులు
- జనాల్లో రైజ్ అవుతున్న 'బీపీ'
- రోడ్డు ప్రమాదాలూ ఎక్కువే
- ఆందోళన కలిగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సర్వే ఫలితాలు



బీపీ బాధితులు
రాష్ట్రం : 19,78,699
జిల్లా : 67,330 (3.4 శాతం)
రాష్ట్రస్థాయిలో : 18వ స్థానం
రాయలసీమలో : 3

మధుమేహం బాధితులు
రాష్ట్రం : 11,13,963
జిల్లా : 57,211 (5.136 శాతం)
రాష్ట్రస్థాయిలో : 5వ స్థానం
రాయలసీమలో : మొదటి స్థానం

బీపీ.. డయాబెటిస్ రెండూ వున్న బాధితులు
రాష్ట్రం : 20,78,999
జిల్లా : 82,985 (3.992 శాతం)
రాష్ట్రస్థాయిలో : 14వ స్థానం
రాయలసీమలో : 1వ స్థానం



జిల్లాలో 'తియ్యటి' ప్రమాదం ముంచుకొస్తోంది. మధుమేహ బాధితుల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అదే సమయంలో ఎక్కువ మంది హైపర్ టెన్షన్‌తో బీపీ బాధితులుగా మారుతున్నారు. ఇక, మధుమేహం, బీపీ.. రెండూ ఉన్న వారి సంఖ్యా 83 వేల వరకు ఉంటోంది. ఇక, మూడేళ్లుగా ఎన్టీయార్ వైద్య సేవలు పొందిన రోగుల సంఖ్య.. రోడ్డు ప్రమాద గణాంకాలూ ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన సర్వేలో వెల్లడైన ఈ అంశాలను సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం వెల్లడించారు.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లాలో మధుమేహ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుదల ఆందోళనకరంగా ఉంది. 57 వేల మందికి పైగా బాధితులతో రాష్ట్రంలో 5వ స్థానం.. రాయలసీమ జిల్లాలతో పోలిస్తే మొదటి స్థానంలో ఉంది. ఇక, హైపర్ టెన్షన్ బాధితుల పరంగానూ ఆందోళన కలిగించేలా ఉంది. రాష్ట్రంలో 18వ స్థానంలో ఉండగా.. రాయలసీమలో కడప, కర్నూలు జిల్లాల తర్వాత మూడవ స్థానంలో ఉన్నాం. ఇక, బీపీ, డయాబెటిస్ రెండూ ఉన్న బాధితుల్లోనూ మన జిల్లా రాయలసీమలో మొదటి స్థానంలో ఉండటం ఆందోళన కలిగించే అంశం. రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రతా ప్రమాణాల విషయంలో జిల్లా గణనీయంగా వెనుకబడి ఉంది. ప్రభుత్వం తాజాగా నిర్వహించిన సర్వేలో ఈ లోపాలు బయటపడ్డాయి. రోడ్డు భద్రతా చర్యలు సక్రమంగా లేనందున రాష్ట్రంలో కృష్ణా, చిత్తూరు జిల్లాల తర్వాత ఎక్కువ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని తేలింది. రోడ్డు ప్రమాద ఘటనల్లో మృతులు, క్షతగాత్రుల సంఖ్య విషయంలో కూడా జిల్లా ఏపీలో మూడో స్థానంలో ఉంది.

ఎన్టీఆర్ వైద్య సేవలూ ఎక్కువే



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద ఉచితంగా సర్జరీలు, చికిత్సలు, ఔషధాలు పొందుతున్న వివిధ రకాల రోగుల సంఖ్య జిల్లాలో గణనీయంగా ఉంది. 2022-23 నుంచీ 2024-25 వరకూ మూడేళ్ల పాటు ఎన్టీఆర్ వైద్య సేవల కింద ప్రభుత్వ సాయం పొందిన వారి సంఖ్యను పరిశీలిస్తే ఈ అంశం వెల్లడైంది. వ్యాధుల వారీగా సేవలు అందుకున్న రోగుల వివరాలిలా వున్నాయి.



- కాలేయ సంబంధిత వ్యాధిగ్రస్తులు ఏపీలో 30,646 మంది వుండగా అందులో జిల్లాలో 1829 మంది వున్నారు. 5.97 శాతం మందితో జిల్లా ఏపీలో 3వ స్థానంలో వుండడం ఆందోళన కలిగిస్తోంది. రాయలసీమలో అయితే కర్నూలు జిల్లా తర్వాత అత్యధిక రోగులు జిల్లాలోనే వున్నారు.



- దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు ఏపీలో 54,362 మంది ఉండగా, అందులో 6.85 శాతం అంటే 3775 మందితో జిల్లా మూడో స్థానంలో వుంది. రాయలసీమ జిల్లాలతో పోలిస్తే మొదటి స్థానంలో ఉంది.



- రాష్ట్రంలో దీర్ఘకాలిక కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు 1,73,479 మంది ఉంటే, 5.02 శాతంతో అంటే 8700 మందితో జిల్లా ఆరవ స్థానంలోనూ, రాయలసీమలో మూడో స్థానంలోనూ వుంది.



- క్యాన్సర్ వ్యాధిగ్రస్తులు ఏపీలో 1,19,397 మంది ఉండగా, అందులో 3.86 శాతం మంది అంటే 4607 మందితో జిల్లా 15వ స్థానంలో వుంది. రాయలసీమలో అయితే మొదటి స్థానంలో వుంది.

- నరాల సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న వారు రాష్ట్రంలో 1,07,433 మంది ఉన్నారు. అందులో 3.376 శాతం అంటే 3626 మందితో జిల్లా 18వ స్థానంలో ఉంది. రాయలసీమలో 4వ స్థానం.



- గుండె సంబంధిత వ్యాధిగ్రస్తుల విషయానికొస్తే రాష్ట్రంలో మొత్తం 2,61,100 మంది వుంటే వారిలో 2.753 శాతం అంటే 7,187 మందితో జిల్లా 21వ స్థానంలో వుంది. అదే రాయలసీమ పరిధిలో జిల్లా 6వ స్థానంలో వుంది.

ప్రతి నియోజకవర్గంలో వంద పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

సీఎం చంద్రబాబు సోమవారం ప్రకటించిన మేరకు జిల్లాలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోనూ వంద పడకల మల్టీ స్పెషాలిటీ లేదా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలుండగా తిరుపతి, శ్రీకాళహస్తి, గూడూరుల్లో ఆ స్థాయి ప్రభుత్వాస్పత్రులు ఇప్పటికే వున్నాయి. తిరుపతిలో టీటీడీ నిర్వహణలో స్విమ్స్, పద్మావతి ఆస్పత్రులు ఉండగా, ప్రైవేటు రంగంలో ఒకటి ఉంది. శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట మండలంలోనూ ఆ స్థాయి ప్రైవేటు ఆస్పత్రి వుంది. వెంకటగిరి, చంద్రగిరిలో వంద పడకలకు తగ్గ భవనాల నిర్మాణం జరిగినా ప్రభుత్వం ఇంకా ఆ స్థాయి కల్పించలేదు. సత్యవేడు, సూళ్లూరుపేట నియోజకవర్గాల్లో 30 పడకల ఆస్పత్రులే వున్నాయి. సీఎం ప్రకటన ఆచరణ రూపం దాలిస్తే త్వరలో వెంకటగిరి, చంద్రగిరి, సూళ్లూరుపేట, సత్యవేడు నియోజకవర్గాల్లోనూ పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యంతో వంద పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు కానున్నాయి.

ఫీల్డ్ విజిట్ తర్వాతే బాండ్లు జారీ

- నాలుగో రోజూ క్యూ కట్టిన టీడీఆర్ బాధితులు
- 284 డాక్యుమెంట్లు లాగిన్



టీడీఆర్ స్పెషల్ డ్రైవ్‌లో అర్జీలు స్వీకరిస్తున్న రాష్ట్ర టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ అదనపు డైరెక్టర్ వరప్రసాద్

తిరుపతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): టీడీఆర్ బాండ్ల జారీ స్పెషల్ డ్రైవ్ నాలుగో రోజైన సోమవారం బాధితులు కార్పొరేషన్ కార్యాలయానికి క్యూ కట్టారు. డాక్యుమెంట్లను తీసుకొచ్చి టౌన్ ప్లానింగ్ సిబ్బందికి అందజేశారు. గడిచిన నాలుగు రోజులుగా 29 మాస్టర్ ప్లాన్ రోడ్లకు గాను 26కు సంబంధించి 284 ఆస్తుల డాక్యుమెంట్లకు లాగిన్ చేశారు. 190 దరఖాస్తులకు వాలిడేషన్ పూర్తిచేయగా మరో 94 సిద్ధంగా ఉన్నాయి. 21 టీడీఆర్ దరఖాస్తులను సిటిజెన్స్ లాగిన్‌లో అప్‌లోడ్ చేశారు. మంగళగిరి నుంచి వచ్చిన టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్ వరప్రసాద్ మేళాను పర్యవేక్షించారు. అర్హుల జాబితా కొలిక్కి వచ్చాక క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతనే బాండ్లు జారీ చేస్తామని చెప్పారు.

స్థలం మాది... బాండ్లు మరొకరికి

హీరోహోండా షోరూం పక్కన వేసిన మాస్టర్ ప్లాన్ రోడ్డుకు నా స్థలం కోల్పోయాను. టీడీఆర్ బాండ్లు నాకు కాకుండా, తప్పుడు పత్రాలు సమర్పించిన వ్యక్తికి ఇచ్చేశారు. న్యాయం చేయాలని పలుమార్లు అధికారులను కలిశాను. హైకోర్టునూ ఆశ్రయించాను. డాక్యుమెంట్లు పరిశీలించి అర్హుడైన నాకు బాండ్లు ఇప్పించాలని వినతిపత్రం ఇచ్చా.

\- శ్రీహరి రెడ్డి, తిరుపతి

బాండ్లను రిలీజ్ చేయమని కోరా

డీబీఆర్ మాస్టర్ ప్లాన్ రోడ్డులో 400 చదరపు గజాల స్థలాన్ని కోల్పోయాం. గతంలోనే టీడీఆర్ బాండ్లు తీసుకున్నాం. బాండ్ల జారీలో జరిగిన అవకతవకల ఆరోపణల నేపథ్యంలో మాకిచ్చిన బాండ్లనూ హోల్డ్‌లో పెట్టారు. వాటిని వినియోగించుకునేందుకు వీలుగా విడుదల చేయాలని కోరా.

\- ప్రసాద్, ఏడీసీ, చిత్తూరు నగరపాలక సంస్థ

వీఆర్వో ఏమయ్యారు?

- 16 మందికి పంపిణీ చేయని పింఛను
- వారమైనా కానరాని ఆచూకీ

సత్యవేడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): సత్యవేడు-1వ సచివాలయంలోని వీఆర్వో చిట్టిబాబు తన పరిధిలోని 16 మందికి ఇంకా పింఛను పంపిణీ చేయలేదు. వారమైనా ఆయన ఆచూకీ లేదు. దీంతో అధికారుల్లో ఆందోళన నెలకొంది. ఈ సచివాలయ పరిధిలో 64 మందికి పింఛను అందించడానికి రూ.2.68లక్షలను వీఆర్వో చిట్టిబాబుకు పంచాయతీ కార్యదర్శి ఇచ్చారు. 48 మందికి రూ.2.02 లక్షలను పంపిణీ చేసిన వీఆర్వో.. 16 మందికి ఇవ్వలేదు. ఈ విషయం తెలిసి ఉన్నతాధికారులు ఫోన్‌ద్వారా వీఆర్వోను సంప్రదించగా, ఆర్డీవో కార్యాలయంలో అత్యవసర సమావేశానికి వెళ్లడంతో పంపిణీ చేయలేకపోయినట్లు చెప్పారు. కానీ, వారం రోజులవుతున్నా వీఆర్వో ఆచూకీ లేదని, ఆయన సెల్‌ఫోను స్విచ్చాఫ్ అయినట్టు పంచాయతీ కార్యదర్శి మునిరవికుమార్ చెప్పారు. కాగా, మండలంలోని కాళమనాయుడుపేట సచివాలయంలో వెటర్నరీ అసిస్టెంట్ షాహిదుల్లా కొత్తమారికుప్పంలో లబ్ధిదారులకు ఈనెల పింఛను రూ.2,63,000 ఇవ్వకుండా పరారైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీఆర్వో వైఖరిపై అధికారుల్లో ఆందోళన నెలకొంది.

'ఆల్తూరుపాడు'కు రూ.669 కోట్లతో కొత్త ప్రతిపాదనలు



ప్రతిపాదనలను ఎమ్మెల్యేకి అందచేస్తున్న టీజీపీ ఈఈ రాధాకృష్ణ

వెంకటగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం ఆల్తూరుపాడులో 1.4 టీఎంసీల నీటిని నిల్వచేసే సామర్థ్యంతో రిజర్వాయరు నిర్మాణానికి కొత్తగా రూ.669 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం అయ్యాయి. త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. సోమశిల-స్వర్ణముఖి కాలువ నిర్మాణంలో భాగంగా ఆల్తూరుపాడు రిజర్వాయరు పనులను 2019లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.310 కోట్లతో మొదలు పెట్టింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక రీ టెండరు పిలిచారు. 26 శాతం లెస్‌కు కాంట్రాక్టు దక్కించుకున్న కడపకు చెందిన ఓ కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టలేదు. దీంతో ఈ రిజర్వాయరును వైసీపీ ప్రభుత్వం రద్దు చేసింది. చంద్రబాబు సీఎం కాగానే.. ఈ ప్రాజెక్టుకు కొత్తగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కొత్త ప్రతిపాదనలను ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వానికి పంపనున్నారు. వచ్చే నెలలో టెండర్లు పిలిచే అవకాశం ఉంది. ఈ రిజర్వాయరు పూర్తయితే వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో 97 వేల ఎకరాలకు సాగునీరు.. శ్రీకాళహస్తి, తిరుపతి, తిరుమలకు తాగునీటి అవసరాలు తీరనున్నాయి. ఈ కొత్త ప్రతిపాదనలను సోమవారం వెంకటగిరిలో ఎమ్మెల్యే కురుగొండ్ల రాధాకృష్ణకు తెలుగుగంగ ఈఈ రాధాకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ రిజర్వాయరును జగన్ ప్రభుత్వం అడ్డుకోవడంతో నిర్మాణ వ్యయం పెరిగిందన్నారు. మట్టికట్టకు అవసరమైన 50 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి మండలాల్లోని చెరువుల్లో తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో తెలుగుగంగ డీఈ విజయరామిరెడ్డి, ఏఈ తిరుమలయ్య తదితరులున్నారు.

ఎక్కువ 'సివిల్' తగాదాలే

- పోలీసు పీజీఆర్ఎస్‌కు 121 ఫిర్యాదులు
- ఏం చేయాలంటూ తలలు పట్టుకుంటున్న అధికారులు



ఫిర్యాదుదారుల వినతులు స్వీకరించి సమస్య వింటున్న అదనపు ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం నిర్వహించిన పోలీసు పీజీఆర్‌కు 121 అర్జీలు వచ్చాయి. వీటిలో ఎక్కువగా భూ సమస్యలు, ఆక్రమణలు, సరిహద్దు సమస్యలు, ఆర్థిక సమస్యలు, భార్యాభర్తల తగాదాలు, విడాకుల కేసులు, వరకట్న వేధింపులు తదితరాలున్నాయి. వచ్చే ఫిర్యాదుల్లో 80 శాతం వరకు 'సివిల్' తగాదాలే ఉండటంతో వాటిల్లో తల దూరిస్తే తమకు ఎలాంటి ఇబ్బందులు వస్తాయోనని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు విభాగానికి సంబంధించి పరిష్కారమయ్యే సమస్యలు పెద్దగా రావడంలేదని కొందరు సిబ్బంది చెబుతున్నారు ముఖ్యంగా కోర్టుల్లో ఉన్న భార్యాభర్తల సమస్యలు ఫిర్యాదుల రూపంలో వస్తుండడంతో సూచనలు ఇచ్చి పంపుతున్నారు. కొన్ని తగాదాలకు సంబంధించి న్యాయపరంగా కోర్టుకు వెళ్లాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'సివిల్ తగాదాలపై ఫిర్యాదులు తీసుకోకుంటే జనం అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఒకవేళ తీసుకుంటే.. పరిష్కార చర్యలు మా పరిధిలో లేవు' అని పోలీసు వర్గాలు పేర్కొన్నాయి. ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి ఆధ్వర్యంలో పీజీఆర్ఎస్ నిర్వహించారు. తనకు ఇష్టం లేకున్నా 17వ సంవత్సరంలోనే తల్లిదండ్రులు బలవంతంగా పెళ్లి చేశారని, పెళ్లయిన ఈ మూడు నెలల్లోనే తనను భర్త చిత్ర హింసలు పెట్టి వేధిస్తున్నాడని ఓ బాలిక ఏఎస్పీ వద్ద ఆవేదన చెందారు. ఈ సమ్యను సీరియస్‌గా పరిశీలించి ఆ బాలికకు న్యాయం చేయాలని శ్రీకాళహస్తి సీఐని ఏఎస్పీ ఆదేశించారు. ఈ ఈ కార్యక్రమంలో వివిధ సర్కిళ్ల నుంచి వచ్చిన సీఐలు మురళి, సాధిక్ ఆలీ, శరత్‌చంద్ర, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, ఇమ్రాన్ బాషా, శ్రీరాములు, ఎస్పీ కార్యాలయం నుంచి సీఐ శ్రీరాములు, బాబి, హంస్సేన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

వాయిదా వేయండి!

ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం నేపథ్యంలో కలెక్టర్‌కు ఎమ్మెల్యే అభ్యర్ధన



కలెక్టర్‌ను కలిసేందుకు అనుచరులతో వచ్చిన ఎమ్మెల్యే కురుగొండ్ల

తిరుపతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సోమవారం ముఖ్య అనుచరులతో కలిసి కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు ఉద్దేశించిన కౌన్సిల్ సమావేశాన్ని నెలాఖరు వరకూ వాయిదా వేయాలని కోరినట్టు తెలిసింది. కౌన్సిల్‌లోని 25 మంది కౌన్సిలర్లూ వైసీపీ వారే. ఛైర్‌పర్సన్‌గా నక్కా భానుప్రియను ఎన్నుకున్నారు. గతేడాది ప్రభుత్వం మారడంతో ముగ్గురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. మరో 13 మంది వైసీపీ కౌన్సిలర్లు కలిపి మొత్తం 16 మంది గత నెల 19వ తేదీన కలెక్టర్‌ను కలసి ఛైర్‌పర్సన్ భానుప్రియపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడానికి సమావేశం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. నిబంధనల ప్రకారం నెల రోజుల్లోపు కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి. తొలుత 16 మంది వైసీపీ సభ్యులు ఛైర్‌పర్సన్ భానుప్రియకు ప్రత్యామ్నాయంగా మరో మాజీ ఛైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలని నిర్ణయించారు. దీనివెనుక టీడీపీ ముఖ్యనేత ఒకరు కీలక పాత్ర పోషించినట్టు సమాచారం. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్ అప్రమత్తమై అసంతృప్తితో ఉన్న 13 మంది సభ్యులు అవిశ్వాస తీర్మానం జోలికి వెళ్ళకుండా నచ్చజెప్పారని సమాచారం. దీంతో కౌన్సిల్ సమావేశం జరిగినా ఛైర్‌పర్సన్‌ను తొలగించే పరిస్థితి లేదని గ్రహించిన టీడీపీ నేతలు కొంత గడువు తీసుకోవాలని భావిస్తున్నట్టు తెలిసింది. అందులో భాగంగానే సోమవారం కలెక్టర్‌ను ఎమ్మెల్యే కలిసి సమావేశం వాయిదా వేయాలని అభ్యర్థించినట్టు టీడీపీ వర్గాల ద్వారా తెలిసింది. గత నెల 16 మంది సభ్యులు ఇచ్చిన నోటీసును రాష్ట్ర ఎన్నికల అధికారులకు పంపిన నేపథ్యంలో.. వారి దృష్టికి తీసుకెళతామని, వారిచ్చే ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేసినట్టు తెలిసింది.

వడదెబ్బతో రైతు మృతి



గురవయ్య (ఫైల్ ఫొటో)

పిచ్చాటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు మండలం ముడియూరు పంచాయతీ తులసికృష్ణాపురానికి చెందిన రైతు గురవయ్య(55) సోమవారం ఉదయం వడదెబ్బతో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం పొలానికి వెళ్లిన ఆయన వడదెబ్బకు గురైనట్లు చెప్పారు. విశ్రాంతి తీసుకుంటే సరి పోతుందని ఇంట్లోనే పడుకోబెట్టారు. సోమవారం వేకువ జామున పరిస్థితి విషమించడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

కనులపండువగా కోదండరాముడి ఊంజల్ సేవ



చంద్రగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో సోమవారం సాయంత్రం కన్నుల పండువగా ఊంజల్ సేవను నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకట్ల కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సవమూర్తిని పరమపదుడుగా వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఊయాలలో అదిష్ఠించి ఊంజల్ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, టెంపల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకులు శ్రీనివాసబట్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు సిద్ధయ్యకు ఎమ్మెల్యే నాని నివాళులు



ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ఉస్తికాయలపెంటలో సోమవారం చనిపోయిన టీడీపీ నాయకుడు తలారి సిద్ధయ్యకు ఎమ్మెల్యే పులివర్తి నాని నివాళులర్పించారు. మృతదేహానికి పూలమాల వేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మృతుని కుటుంబ సభ్యలను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నాని వెంట పార్టీ అధ్యక్షుడు రఘునాథ, కార్యదర్శి మహేష్ నాయుడు, మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్య దినోత్సవ ర్యాలీ ప్రారంభం



చంద్రగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా చంద్రగిరిలోని రూరల్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ .యుగంధర్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తల్లి, నవజాత శిశువుల ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగ,ధ్యానం చేయాలని సూచించారు. డాక్టర్ .మధుసూదన్‌రావు మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలన్నారు.మూఢనమ్మకాలను వీడి ఆధునిక వైద్య సేవలు,పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ సౌమ్య ప్రియ మాట్లాడుతూ అంటువ్యాధులు రాకుండా పరిసరాల,వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. డాక్టర్ రేవతి మాట్లాడుతూ దంత సంరక్షణ చాలా అంటువ్యాధులు రాకుండా కాపాడుతుందన్నారు. జూనియర్ డాక్టర్లు సాయిలక్ష్మి ప్రణీత హెల్త్ ఎడ్యుకేటర్ టాటాబాయి, సూపర్‌వైజర్ నారాయణరాజు ,ఎం.ప్రమీల, పద్మావతమ్మ, నర్సింగ్ కాలేజ్ ట్యూటర్స్ సుభాషిని, రజిని, నర్సింగ్ విద్యార్థినులు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పెన్షన్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



నిరసన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

పాకాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని రైల్వే పెన్షనర్ల అసోసియేషన్ పాకాల యూనిట్ అధ్యక్షుడు అల్బర్ట్, కార్యదర్శి ఎస్. సత్య నారాయణ శెట్టి సభ్యులు డిమాండు చేశారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. రైల్వే పెన్షనర్ల హక్కులు కాపాడాలని, అందాల్సిన ప్రయోజనాలు అందజేయాలని కోరారు. పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ రామయ్య, కుస్తర్ బాషా సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రామస్వామి పుష్పపల్లకి సేవ



పాకాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే కాలనీలోని కోదండ రామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పుష్పపల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పుష్పాలతో అలంకరించిన వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మెన్ డాక్టర్ శ్రీకావ్య, కార్యదర్శి .రామారావ్, విరాళ దాత వి.శాంతమ్మ, ఆలయ కమిటీ సభ్యులు,తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వావలంబనకు ప్రభుత్వ పథకాలు



సుధారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

చంద్రగిరి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతమున్నది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి అన్నారు. సోమవారం చంద్రగిరి పంచాయతీలోని దాసరివీధి, జమండ్లవీదిలో మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు కోసం స్వయం ఉపాధి కల్పనకు పలు శిక్షణా కార్యక్రమాలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. శక్తియాప్, 1002 అత్యవసర నంబర్లను వినియోగించుకోవాల ప్రవేశపెట్టిందన్నారు. తాగునీరు, మురుగు కాలువలు, వీధిలైట్లు, సీసీరోడ్లు తదితర అభివృద్ధి కార్యక్రమాలపై ఎమ్మెల్యే నాని దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీపీగా చంద్రమోహన్‌రెడ్డి బాధ్యతల స్వీకారం



చంద్రమోహన్‌రెడ్డిని అభినందిస్తున్న మోహిత్‌రెడ్డి తదితరులు

తిరుపతి రూరల్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): రూరల్ మండల ఎంపీపీగా ఎన్నికైన చంద్రమోహన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన్ను నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డితోపాటు జెడ్పీటీసీ సభ్యురాలు రత్నమ్మ, వైస్ ఎంపీపీలు విడుదల మాధవరెడ్డి, వేముల యశోద, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు అభినందించారు. ఈసందర్భంగా చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులను సమన్వయ పరుచుకుని మండలాన్ని అభివృద్ధి చేస్తామన్నారు.

భూ కబ్జా కేసులో వైసీపీ నేత రుద్ర గోపి, మరో ముగ్గురి అరెస్టు



అరెస్టైన రుద్ర గోపి

తిరుచానూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): భూకబ్జా కేసులో వైసీపీ నాయకుడు రుద్ర గోపితో పాటు మరో ముగ్గురిని తిరుచానూరు పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించి సీఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు తిరుపతి రూరల్ మండలం చెన్నాయగుంటలో నిర్మలకు చెందిన భూమిని రుద్ర గోపితోపాటు మరో ముగ్గురు నకిలీ పట్టాలు సృష్టించి కబ్జా చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు డిసెంబరులో తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. సోమవారం గోపితో పాటు మునిరామయ్య, గోపాల్, మునికృష్ణయ్యను అరెస్టు చేసినట్లు సీఐ సునీల్‌కుమార్ ఆంధ్రజ్యోతికి చెప్పారు.

ఉచిత వైద్య శిబిరం

రేణిగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ ఫండ్ రాస్ ఆధ్వర్యంలో వైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో ప్రపంచ ఆరోగ్య దినాన్ని పురస్కరించుకుని కాలనీ వాసుల కోసం శిబిరాన్ని నిర్వహించి మం దులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్ రెడ్డి, డాక్టర్లు స్రవంతి, అనంత్, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

తిరుపతి రూరల్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలోని 0-6 సంవత్సరాల వయసున్న పిల్లలకు మంగళవారం నుంచి ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. 5-15సంవత్సరాల వారికి ఆధార్ బయోమెట్రిక్ నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అవిలాల, తిరుచానూరు, చెర్లోపల్లె, మంగళం-2 సచివాలయాల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలు

తిరుమల, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామి దర్శనానికి ఆరు గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 10 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. శనివారం హుండీ ఆదాయం రూ.3.63 కోట్లు లభించింది. ఆదివారం శ్రీవారిని 72,930 మంది భక్తులు దర్శించుకున్నారు. 23,126 మంది తలనీలాలు సమర్పించారు.

సర్వశ్రేయాస్ ట్రస్టుకు రూ.30 లక్షల విరాళం



తిరుమల, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు సోమవారం రూ.30 లక్షలు విరాళంగా అందింది. బెంగళూరుకు చెందిన బీఎంకే నగేష్ అనే భక్తుడు టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి చేతులమీదుగా అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

12న తుంబురతీర్థ ముక్కోటి



తిరుమల, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): తిరుమల అడవుల్లోని తుంబురతీర్థ ముక్కోటి ఈనెల 12న జరుగనుంది. శ్రీవారి ఆలయానికి ఏడున్నర మైళ్ల దూరంలో ఈ తీర్థం ఉంది. శేషాచలంలో ధర్మ, జ్ఞాన, భక్తి, వైరాగ్య, ముక్తిప్రదాలు కలిగించే ఏడు తీర్థాల్లో ఇది ఒకటి. ప్రకృతి సౌందర్యాల నడుమ ఆరోజున తుంబురతీర్థంలో స్నానమాచరిస్తారు. ఈ తీర్థానికి వెళ్లిరావడానికి టీటీడీ తగిన ఏర్పాట్లు చేస్తుంది.

తిరుమలలో ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్



విజేందర్ గుప్తా- సంతోష్ సుమన్ మంజి

తిరుమల, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఢిల్లీ అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తా, బీహార్ మంత్రి సంతోష్ సుమన్ మంజి ఉన్నారు.

పూడి రైల్వే గేటు మూసివేత

వడమాలపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వడమాలపేటకు సమీపంలోని పూడి రైల్వే గేటు మరమ్మతుల కారణంగా రెండు రోజులు పాటు రాత్రి సమయాల్లో మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం, బుధవారం రాత్రివేళల్లో 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే మూసివేస్తున్నట్లు తెలిఆపరు. పగలు యాథావిధిగా రాకపోకలు సాగుతాయన్నారు. వడమాలపేట నుంచి పూడి మీదుగా తిరుచానూరు, పత్తిపుత్తూరు అప్పలాయగుంటలకు వెళ్లే ప్రయాణికులు గమనించాలని కోరారు. ప్రస్తుతం రైళ్ల వేగం పెంచడంతో రైల్వే గేటుతో పాటు క్రాసింగ్‌ల వద్ద మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. ఈనెల 10న గురువారం ఉదయం నుంచి యథావిధిగా గేటు పనిచేస్తుందని తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి



ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, సీఐటీయూ నాయకులు

తినుపతి(ఆటానగర్) ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ముజఫర్ అహ్మద్ డిమాండ్ చేశారు. తిరుపతి సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట సోమవారం విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు మహాధర్నా చేశారు. వారు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కాంట్రాక్టు కార్మికుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కారం కాలేదని మండిపడ్డారు. ఎస్పీడీసీఎల్ ఆదాయంలో కార్మికులకు ఒకటిన్నర శాతం కూడా వ్యయం చేయలేదన్నారు. కాగా, సీజీఎం హెచ్ఆర్‌డీ రమాదేవి ఆందోళనకారులతో, నాయకులతో చర్చలు జరిపారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను సీఎండీతో చర్చించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. అంతకుముందు లక్ష్మీపురం కాలనీ నుంచి కార్పొరేట్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

అతిథిగృహంలో సమస్యల బస

సన్నిధానంలో ఫర్నిచర్ పాడైందంటూ భక్తుల ఫిర్యాదులు



సన్నిధానం గెస్ట్‌హౌస్ సెల్లార్‌లో పాడైపోయిన ఫర్నిచర్

తిరుమల, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని సన్నిధానం గెస్ట్‌హౌస్‌లో ఫర్నిచర్ దెబ్బతింది. కొండమీద ప్రస్తుతం 7,700 గదులున్నాయి. అందులో నాలుగు బ్లాకుల్లో 48 సూట్లు కలిగిన సన్నిధానం గెస్ట్‌హౌస్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. మూడు బెడ్‌రూములతో పాటు ఓ లివింగ్ రూమ్, డైనింగ్ హాల్ ఉన్నాయి. బసకు ఇది సౌకర్యవంతంగా ఉంటుందని వీఐపీలు భావిస్తుంటారు. అయితే ఇందులోని మంచాలు, బెడ్లు, డైనింగ్ టేబుల్, డ్రెస్సింగ్ టేబుల్స్, కుర్చీలు చాలావరకు దెబ్బతిన్నాయి. గదుల్లో నల్లుల సమస్య వేధిస్తోందని భక్తులు ఫిర్యాదు చేస్తున్నారు. ఇక్కడ ట్రిబుల్ బెడ్ రూముకు రూ.6,800 అద్దె. ఇక్కడ పాడైన ఫర్నిచర్‌ను తొలగించి వేరే అతిథిగృహాల్లో ఉండే వాటిని సర్దుబాటు చేస్తూ వస్తున్నారు. ఇటీవల పూర్తిగా పాడైపోవడంతో విమర్శలు అధికమయ్యాయి. గత అధికారులు ఈ విషయంలో నిర్లక్ష్యం చూపారనే విమర్శలు అధికంగా వినిపించాయి. ఫిర్యాదుల క్రమంలో కొత్త ఫర్నిచర్ సమకూర్చుకోవడంపై టీటీడీ దృష్టి సారించింది. అన్ని సూట్లలో క్రమపద్ధతిలోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. వర్క్స్ కమిటీ కూడా పరిశీలించి కొన్ని సూచనలతో నివేదికను సమర్పించింది. ఇటీవల ఓ సంస్థ రూ.3.95 కోట్లతో టెండరును పొందినట్టు తెలిసింది.త్వరలోనే ఫర్నిచర్ ఏర్పాటుతో సన్నిధానంలో సమస్యలు తగ్గే అవకాశం కనిపిస్తోంది.

అంతర్రాష్ట్ర నిందితుడి అరెస్టు

● బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు స్వాధీనం



నిందితుడి అరెస్టు చూపుతున్న క్రైం పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో అంతర్రాష్ట నిందితుడు డిల్లీ గణేష్‌ను సెంట్రల్ క్రైం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సెంట్రల్ క్రైం డీఎస్పీ శ్యాంసుందర్ కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా అల్లికుజహల్ ప్రాంతానికి చెందిన పెరుమాల్ కోవిల్ వీధిలోని డిల్లీ గణేష్ జులాయిగా తిరుగుతూ చిన్న చిన్న దొంగతనాలు చేసే వారితో చేతులు కలిపాడు. 2013 నుంచి 2021 వరకు తన మిత్రులతో జట్టు కట్టాడు. ప్రజలను బెదిరించి బంగారు ఆభరణాలు, డబ్బు లాక్కొనేవాడు. గతంలో మాధవరం, పూన్నమలై పోలీసులు ఇతడిని అరెస్టు చేసి సుమారు ఎనిమిది కేసుల్లో నగలు రికవరీ చేశారు. చెన్నై సెంట్రల్ జైలులో శిక్ష అనుభవించి వచ్చాడు. ఆ తర్వాత ఎక్కడైనా పెళ్లిళ్ల జరుగుతుంటే దొంగతనాలకు పాల్పడేవాడు. ఏటీఎంల వద్ద పిన్ నెంబర్లు మార్చి డబ్బు కాజేసేవాడు. ఈ ఏడాది మార్చి 20న రేణిగుంట రోడ్డులోని కేఎస్ఆర్ కల్యాణ మండపంలో పెళ్లి రిసెప్షన్ సమయంలో.. గదిలో భద్ర పరచిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డబ్బులు అపహరించాడు. దీనిపై బాధితులు క్రైం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావు నేతృత్వంలో క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, సీఐలు శివకుమార్, ప్రకాష్, ఎస్ఐ ప్రదీప్‌కుమార్, సిబ్బంది బృందాలుగా ఏర్పడి పాత నేరస్థుల కదలికలపై నిఘా ఉంచారు. వారి ఫొటోలు, వేలిముద్రలు పరిశీలించారు. ఈ క్రమంలో డిల్లీ గణేష్ మళ్లీ తిరుపతిలో దొంగతనాలు చేయడానికి వచ్చినట్లు క్రైం పోలీసులకు తెలిసింది. సోమవారం తిరుచానూరు రోడ్డులోని శిల్పారామం సమీపంలో నిందితుడ్ని వలపన్ని పట్టుకున్నారు. ఇతడిని వేలిముద్రలు పరిశీలించారు. కల్యాణ మండపంలో దొంగతనం చేసినట్లు నిందితుడు అంగీకరించాడు. అతడి నుంచి 11.2 గ్రాముల బంగారు నగలు, 674 గ్రాముల వెండి వస్తువులు, రూ.59,500 నగదు, చోరీకి ఉపయోగించిన ద్విచక్ర వాహనం, రూ.మూడు లక్షలు విలువ చేసే వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ చెప్పారు. తిరుపతి, పిచ్చాటూరు, వరదయ్యపాలెం ప్రాంతాల్లో దొంగతనాలకు సంబంధించి వస్తువులనూ రికవరీ చేశారు. కేసులో ప్రతిభ కనపరచిన డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు, సిబ్బందికి నగదు రివార్డులు అందచేశారు.

తిరుపతిలో రౌడీలకు తావులేదు

● ప్రతి నెలా స్టేషన్లకు పిలిపించి హెచ్చరించాలి ● మళ్లీ మళ్లీ రౌడీయిజం చేస్తే పీడీ యాక్టు

● టెలికాన్ఫరెన్సులో ఎస్పీ ఆదేశాలు ● ● ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రౌడీలు కనిపించకూడదు. ఈ విషయంలో గట్టిగా పనిచేయండి' అని డీఎస్పీ శ్రీలతకు ఎస్పీ హర్షవర్ధనరాజు ఆదేశాలు జారీ చేశారు. 'తిరుపతిలో రౌడీల వీరంగం' అంటూ సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఉదయం జరిగిన టెలికాన్ఫరెన్సులో దీనిపై ఎస్పీ స్పందించారు. రౌడీషీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఎక్కడైనా రౌడీయిజానికి పాల్పడితే వారిపై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించాలన్నారు. ప్రతి రోజూ స్టేషన్ల వారీగా ఉన్న రౌడీలు, కేడీలు, ఆకతాయిలపై నిఘా ఉంచాలన్నారు. నెలకోసారి రౌడీలను స్టేషన్లకు పిలిపించి గట్టిగా కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. మళ్లీ ఎక్కడైనా రౌడీయిజానికి పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే ఎలాంటి చర్యలు ఉంటాయో వారికి చెప్పాలన్నారు. కాగా, తిరుపతి ఈస్ట్ పరిధిలోని రైల్వే కాలనీలోని నలుగురు రౌడీలను సీఐ రామకృష్ణ పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. బైండోవర్ కేసులు నమోదు చేసి పంపారు. వర్సిటీ పరిధిలోనూ కొందరికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రెవెన్యూ సదస్సుల అర్జీలను పరిష్కరించాలి



సమస్యలను సమీక్షిస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజలు అందజేసిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే పులివర్తి నాని రెవెన్యూ అధికారులను కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే రెవెన్యూ అధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలోని ఆది ఆంధ్ర, ఆదిద్రావిడ, ఎస్టీ గ్రామాలను సమస్యలు లేని గ్రామాలుగా తీర్చి దిద్దుతామన్నారు. గ్రామాల్లో స్మశాన వాటికలకు దారి సమస్యలు, స్థలాల సమస్య నెలలోపు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సమస్యలకు సకాలంలో పరిష్కారం చూపాలన్నారు. వీఆర్వో పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. తహశీల్దార్ సంతోష్ సాయి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలలో 8 అడుగుల జెర్రిపోతు



తిరుమల, ఏప్రిల్7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శిలాతోరణం వద్ద దుకాణంలోకి చొరబడిన జెర్రిపోతును సోమవారం భాస్కర్‌నాయుడు పట్టుకున్నారు. తెల్లవారు జామున ఐదు గంటల సమయంలో ఎనిమిది అడుగుల పొడవైన జెర్రిపోతును గమనించిన దుకాణదారులు భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన పామును పట్టి అడవిలో వదిలేశారు.

టీటీడీ ట్రస్టులకు రూ.కోటి విరాళం



రూ.కోటి విరాళానికి సంబంధించి డీడీలను అదనపు ఈవోకు అందజేస్తున్న ఆ సంస్థల ప్రతినిధి రాఘవేంద్ర

తిరుమల, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): టీటీడీలోని వివిధ ట్రస్టులకు సోమవారం రూ.కోటి విరాళంగా అందింది. ఒడిశాకు చెందిన శివమ్ కాండేవ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు రూ.20 లక్షలు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.20 లక్షలు, స్విమ్స్ ట్రస్టుకు రూ.20 లక్షలు, ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు అందజేశారు. అలాగే అదే రాష్ట్రానికి చెందిన బలభద్ర డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ కూడా ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందజేశారు. రంగనాయకమండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి కదిరి ఎమ్మెల్యే వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో ఆ సంస్థ ప్రతినిధి రామవేంద్ర విశ్వకర్మ డీడీలను అంద జేశారు.

సీతారాముల కల్యాణం చూతము రారండి



ఏనుగుపై ముత్యాల ఊరేగింపు



కల్యాణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి (టీటీడీ), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కోదండరామ స్వామి ఆలయంలో సోమవారం రాత్రి సీతారాముల కల్యాణం కమనీయంగా సాగింది. టీటీడీ ఏడీ భవనంలోని ట్రెజరీ విభాగంలోని ముత్యాలకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గజరాజుపై ముత్యాలను ఊరేగింపుగా తీర్థకట్ట వీధి, గాంధీరోడ్డు, గోవిందరాజ స్వామి దక్షిణ మాడ వీధి, బజారు వీధి మీదుగా ఆలయానికి తీసుకొచ్చారు. సాయంత్రం ఆలయంలోని కల్యాణ వేదికలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. పూర్ణాహుతి, నివేదన, అక్షతారోహణం, ముత్యాల తలంబ్రాల సమర్పణ, యజమానికి వేద ఆశీర్వాదం, హారతి తదితర కార్యక్రమాలు జరిగాయి. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఆలయ ప్రాంగణంలోనే ఊరేగించారు. డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకర్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్, అర్చకులు పాల్గొన్నారు.

అవిలాల చెరువులోకి డెయిరీ మురుగునీరు

ఎంపీడీవోకు స్థానికుల ఫిర్యాదు



ముళ్లచెట్ల మధ్యలో చేరిన నీరు



డెయిరీ ప్రహరీని దాటుకుని చెరువులోకి చేరిన మురుగునీరు

తిరుపతి రూరల్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీలోని మదర్‌డెయిరీ(బాలాజి డెయిరీ) నుంచి వ్యర్థాలతో కూడిన నీరు అవిలాల చెరువులోకి చేరుతోంది. డెయిరీకి ఎదురుగా చెరువు ప్రహరీ ఉంది. సరైన డ్రైనేజీవ్యవస్థ లేకపోవడంతో ఆరునెలలుగా వ్యర్థాల నీరు ప్రహరీగోడ దాటుకుని చెరువులోకి చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. మురుగునీరు ఇంకిపోయి చుట్టుపక్కల తమ బోరుబావుల్లో కలసి తాగునీరు కలుషితమవుతోందంటున్నారు. దుర్వాసన భరించలేకపోతున్నామంటున్నారు. అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ యాజమాన్యం ప్రమాణాలు, నిబంధనలు పాటించకుండానే మురుగునీరు బయటకు వదులుతోందని రూరల్ ఎంపీడీవో రామచంద్రకు స్థానికులు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయన ఆప్రాంతాన్ని పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్థానికుల ఫిర్యాదు మేరకు ఇప్పటికే పలుమార్లు సంస్థ యాజమాన్యానికి నోటీసులు జారీ చేశామన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి నరసింహమూర్తి, పక్కన వేదాదేవి

తిరుపతి రూరల్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): రోజూ యోగా సాధన ద్వారా శారీరక, మానసిక వికాసంతోపాటు సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని జిల్లా అడిషనల్ అండ్ సెషన్స్ జడ్జి(రెడ్‌సాండిల్) ఎ.నరసింహమూర్తి తెలిపారు. అనసూయ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్వీఐటీఐ కళాశాల సహకారంతో సోమవారం ఎమ్మార్‌పల్లి సర్కిల్‌లో నిర్వహించిన ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవగాహనా ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అనేక రకాల అనారోగ్య సమస్యలకు గురవుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించి అవగాహనా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. వీహెచ్‌పీ ఈసీ సభ్యురాలు సుమతిరెడ్డి, అనసూయ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వేదాదేవి, ఎస్వీ ఐటీఐ కళాశాల కరస్పాండెంట్ జి.ఓంప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ మానసిక వికాసానికి యోగా సాధన దోహదం చేస్తుందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, అపస్మా నాయకులు టి.రామకృష్ణారెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, భవానీశంకర్ పాల్గొన్నారు.

నైపుణ్యాల పెంపుతోనే మెరుగైన ఉద్యోగాలు



తిరుపతిరూరల్, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): ప్రొఫెషనల్ కోర్సులు చదివే విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలనూ పెంచుకోవాలని రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ (రిమ్స్) ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. బైరాగిపట్టెడలోని కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ, ఎంఎస్సీ (కంప్యూటర్ సైన్స్)ప్రథమ సంవత్సర విద్యార్థులకు మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంప్లాయిబిలిటీ స్కిల్స్‌పై ఏడు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రణాళికలు రూపొందించుకుని ఆచరించాలన్నారు. మ్యాజిక్ బస్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటప్రసాద్, ఛైర్మన్ వై.కొండారెడ్డి, డైరెక్టర్లు వై.ఆనందరెడ్డి, వై.విజయ్‌రెడ్డి, హెడ్లు డాక్టర్ పి.నిరంజన్‌రెడ్డి, వి.మధుర పాల్గొన్నారు.

కత్తిసాము పోటీల్లో ప్రతిభ

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని నారాయణ బాలికల పాఠశాల విద్యార్థినులు కత్తిసాము పోటీల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభచాటారని ప్రిన్సిపాల్ తులసి పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఆమె మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రం కటక్ జేఎన్ ఇండోర్ స్టేడియంలో 26వ సబ్ జూనియర్ నేషనల్ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 8వ తరగతి చదువుతున్న గోప్రిక, శ్లోక, సుదీక్షలు సత్తా చాటారన్నారు. త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో రీజనల్ ఇన్‌చార్జి సురేష్, విద్యార్థినులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

లిటిల్ ఏంజల్స్ స్నాతకోత్సవం



పట్టాలు అందుకున్న చిన్నారులతో ముఖ్యులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 7 (ఆంధ్ర జ్యోతి): స్థానిక యశోదనగర్‌లోని లిటిల్ ఏంజల్స్ పాఠశాల స్నాత కోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులు రుయా సీఆర్వో డాక్టర్ పద్మశ్రీ, అధ్యాపకులు సాయిమాధురి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జంక్‌ఫుడ్ వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వల్ల లాభాలు, పరిశుభ్రత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు స్నాతకోత్సవ పట్టాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాల అధినేత కె.రాజగోపాల్ రెడ్డి, ఛైర్మన్ ఎం.రమాదేవి, డైరెక్టర్ డాక్టర్ శ్వేత, ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతాశిశువుల ఆరోగ్య భద్రతకు కృషి

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలను పూర్తిగా నివారించే దిశగా దృష్టి సారించాల్సిన అవసరం ఎంతో ఉందని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆయన సోమవారం వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ ఆవరణలో ఆరోగ్య భద్రతపై అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. గర్భవతులు, చిన్నారులు, కౌమార దశలో ఉన్న బాలికల ఆరోగ్య విషయంలో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఆర్.ఆర్.రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పద్మావతి, లావణ్య, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి హామీ.. రూ.లక్ష ఆర్థికసాయం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తిరుచానూరుకు చెందిన లీలావతి, శరవణ దంపతులకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సోమవారం రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. సంక్రాంతి సందర్భంగా జిల్లా పర్యటనకు వచ్చిన సీఎం తిరుచానూరులో పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరాను ప్రారంభించారు. ఆ సమయంలో లీలావతి కుటుంబాన్ని సందర్శించారు. ఇంటికోసం ఆర్థిక సాయం అందించాలని వారు సీఎంను అభ్యర్థించారు. ఆ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ రూ.లక్ష చెక్కును అందజేశారు.

ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా రుయాలోని చిన్నపిల్లల విభాగంలో సోమవారం ఆరోగ్య భవిష్యత్తుకు సంబంధించి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశానికి ఆరోగ్యవంతమైన పౌరులను అందించాలంటే గర్భిణులు చక్కటి ఆహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, వైద్యాధికారులు మనోహర్, కిరీటి పాల్గొన్నారు.

సర్జరీతో అంగవైకల్యం దూరం

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు సర్జరీతో అంగవైకల్యాన్ని దూరం చేసే అవకాశం ఉంటుందని రుయా చిన్నపిల్లల శస్త్ర చికిత్స వైద్యుడు జగదీష్ తెలిపారు. ప్రపంచ చిన్నపిల్లల శస్త్ర చికిత్స దినోత్సవం సందర్భంగా ఆయన రుయాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో శస్త్ర చికిత్సలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. చిన్నారులకు చేసే శస్త్ర చికిత్సలు, వాటి ఉపయోగాల గురించి వివరించారు. ఏఆర్ఎంవో హరికృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పోషణ్ పక్వాడా

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి ఈ నెల 22వ తేదీ వరకు పోషణ్ పక్వాడా నిర్వహించనున్నట్లు డీఆర్వో నరసింహులు తెలిపారు. దీనిపై సోమవారం ఆయన అధికారులతో సమీక్షించారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా పోషక విలువలు, ఆరోగ్యకరమైన ఆహారంపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు, కౌమార దశలో ఉన్న బాలికలకు పోషకాహార ఉపయోగాలను తెలియజేయాలని సూచించారు. ఐసీడీఎస్ పీడీ వసంతబాయి, అధికారులు పాల్గొన్నారు.

అభాగ్యులకు రొట్టెల పంపిణీ



తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): అభాగ్యులకు బాసటగా నిలవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఎన్ఎస్ఎఫ్(నవ సమాజ ఫెడరేషన్) వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నేల విజయ్ భాస్కర్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆయన సోమవారం రుయాస్పత్రి పరిధిలోని రోగులకు, అభాగ్యులకు రొట్టెల ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఆకలి తీర్చడానికి మించిన పుణ్యకార్యం మరొకటి లేదని తెలిపారు.



జాతర చాటుకు ఇక నెలరోజులే..!

- ఆలోపు ధర్మకర్తల మండలి నియామకం జరిగేనా?
- నేడు మంత్రి ముందుకు గంగమ్మ పంచాయితీ?

తిరుపతి- ఆంధ్రజ్యోతి: రాష్ట్ర ధర్మాదాయ, దేవాదాయ శాఖకు చెందిన తాతయ్యగుంట గంగమ్మ ఆలయ జాతర రాయలసీమలో ఎంతో ప్రసిద్ధి చెందింది. తిరుపతి జాతరను స్టేట్ ఫెస్టివల్‌గా కూడా ప్రభుత్వం ప్రకటించింది. సరిగ్గా నెలరోజులకు జాతరకు చాటింపు జరగనుంది. ఆలోపు ధర్మకర్త మండలి నియామకం జరుగుతుందా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గంగమ్మ ఆలయ పాలకమండలి నియామకం జరగాలంటే దేవాదాయశాఖ నుంచి నోటిఫికేషన్ విడుదల కావాలి. ఆసక్తివున్న వారు దరఖాస్తు, పరిశీలన కోసం 20 రోజులు గడువు ఇవ్వాలి. అయితే ఇప్పటి వరకు నోటిఫికేషన్ కూడా విడుదల చేయలేదు. మే 6వ తేదీ గంగజాతరకు చాటింపు వేస్తారు. 13వ తేదీ జాతర జరుగుతుంది. జాతర నేపథ్యంలో 5 మంగళవారాలు కూడా గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు, భక్తుల తాకిడి ఉంటుంది. నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్న వారిని ప్రభుత్వం అదిగో..ఇదిగో అని ఊరిస్తూ వస్తోంది. అయితే ఈసారి గంగమ్మ ఆలయానికి నోటిఫికేషన్ లేకుండానే పాలకమండలిని ప్రకటించేదిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. మంగళవారం తిరుపతికి వస్తు న్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ముందు గంగమ్మ ఆలయ పాలకమండలి గురించి కూటమి నేతలు పంచాయితీ పెట్టే అవకాశాలున్నాయి. ఛైర్మన్ రేసులో టీడీపీ నుంచి నగర ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్ యాదవ్, ఆముదాల తులసీరాం, జనసేన నుంచి హరీష్ శంకర్, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, బీజేపీ నుంచి పొనగంటి భాస్కర్ పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో మహేష్ యాదవ్‌కు దక్కే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా జాతరలోపు గంగమ్మ ఆలయంతో పాటు వేశాలమ్మ, పెదగంగమ్మ, అంకాళమ్మ ఆలయాల పాలకమండళ్లను కూడా పూర్తిచేయాలని ఆశావహులు కోరుతున్నారు.

● ఫ్లోరింగ్ పనులు త్వరగా చేస్తేనే..

గత ప్రభుత్వంలో అరకొర పనులను పక్కన పెట్టి గంగజాతర క్రతువును ముగించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు మళ్లీ మొదలయ్యాయి. ఇటీవల ఆలయాన్ని సందర్శించిన టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఆలయంలో పూర్తి కావాల్సిన పనులకు అవసరమైన నిధులను మంజూరు చేశారు. ఫ్లోరింగ్ పనులు పూర్తయితే భక్తులకు ఇబ్బందులు లేకుండా జాతర జరిగిపోతుంది. ప్రస్తుతం తూర్పున ఉన్న ప్రధాన ముఖ ద్వారాన్ని మూసివేసి పనులు చేస్తున్నారు. దక్షిణవైపు గేటునుంచే భక్తులను అనుమతిస్తున్నారు. ఈ నెల 15 తొలి మంగళవారం ప్రారంభమయ్యేలోపు పనులు పూర్తిచేయాలని సోమవారం ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే శ్రీనివాసులు ఆలయ ఈవో జయకుమార్‌ను ఆదేశించారు.

పోటెత్తిన అర్జీదారులు

- పీజీఆర్ఎస్‌కు 480 వినతులు
- రెవెన్యూ శాఖకే 398 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ వేదికగా సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు అర్జీదారులు పోటెత్తారు. గత వారం రంజాన్ పండుగ సందర్భంగా కార్యక్రమం రద్దు కావడంతో సోమవారం పెద్దయెత్తున ప్రజలు తరలివచ్చారు. ఉదయం 9 గంటలకే ప్రారంభమైంది. మొత్తం 480 అర్జీలు రాగా, అందులో రెవెన్యూ శాఖకే 398 వచ్చాయి. ఆన్‌లైన్ రసీదుల కోసం నిరీక్షించాల్సి వచ్చింది. ఎండను దృష్టిలో ఉంచుకుని తాగునీరు, తేనీరు అందుబాటులో ఉంచారు. అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

రూరల్ తహసీల్దారుపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు



ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారు..

తిరుపతి రూరల్ మండల పరిధిలోని కోట్లాది రూపాయల ప్రభుత్వ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళుతున్నాయని, వాటిని రక్షించాల్సిన తహసీల్దారు రామాంజులనాయక్ కబ్జాదారులతో లాలూచీ పడుతున్నారని రూరల్ మండల ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు యశోధ, మాధవరెడ్డి, పలువురు ఎంపీటీసీలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దారుపై శాఖాపరమైన చర్యలు తీసుకుని భూములను పరిరక్షించాలని కోరారు.

ఆకట్టుకున్న కల నిజమాయే సాంఘిక నాటకం



నృత్యం చేస్తున్న కళాకారులు

తిరుపతి (కల్చరల్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మహతి కళాక్షేత్రం వేదికగా టీటీడీ సహకారంతో మంజుల కళానిధి సాంస్కృతికోత్సవాలు సోమవారం అట్టహాసంగా నిర్వహించారు. భరతనాట్యం, జానపద నృత్యాలతో చిన్నారులు అలరించారు. విజయనగరానికి చెందిన వసుపర్తి కనకమహాలక్ష్మి మయసభ (దుర్యోధన ఏకపాత్రాభినయం) ఆహూతులను మంత్రముగ్ధులను చేసింది. మంజుల కళానిధి ఛైర్మన్ జయరామయ్య రచించిన కల నిజమాయే సాంఘిక, శ్రీకృష్ణ పారిజాతం పౌరాణిక నాటకాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఉగాది సందర్భంగా మంజుల కళానిధి సంస్థ తరపున పలువురు కళాకారులకు మయూరి పురస్కారాలను ప్రదానం చేశారు. వీఎస్ భరద్వాజ్, డాక్టర్ శాంబోలు హరినాథ్, డాక్టర్ ఆమూరి సుబ్రహ్మణ్యం, కర్నెకోట మహేశ్వర్, వసుపర్తి కనకమహాలక్ష్మి, బిజి సుజనా యాదవ్, ఓలేటి చంద్రబాబు నాయుడు, కన్నెప్పగారి కేశవులు పురస్కారాలను అందుకున్నారు.

వినాయకసాగర్‌లో వైసీపీ వీధి నాటకమేంటి?

విచారణ జరిపి చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ అనుమతి లేకుండానే వైసీపీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినాయక సాగర్‌లో వీధి నాటకం వేయడమేంటని టీడీపీ నేతలు నరసింహ యాదవ్, రవినాయుడు, ఆర్సీ మునికృష్ణ, శ్రీధర్ వర్మలు కమిషనర్ మౌర్యను ప్రశ్నించారు. సోమవారం కమిషనర్‌ను ఆమె కార్యాలయంలో టీడీపీ నేతలు కలిశారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు చిన్నపాటి నిరసన చేయాలన్నా తమను ఇంట్లోనుంచి బయ టకు రానివ్వకుండా హౌస్ అరెస్టు చేసేవారని చెప్పారు. అలాంటిది వాకర్స్ తిరిగే వినాయక సాగర్‌లో సెట్టింగ్‌లు వేసి నాటకాలేయడ మేంటన్నారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ తనకు సమాచారం వచ్చిన వెంటనే పోలీసుల దృష్టికి తీసుకొచ్చామని, అప్పటికే వారు బయటకు వచ్చినట్టు తెలిసిందని అన్నారు. విచారణలో వీధి నాటకం వెనుక సిబ్బంది పాత్ర ఉందని తేలితే తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వైసీపీ హయాంలో విద్యుత్ సంస్థలు నిర్వీర్యం

- ఎమ్మెల్యేలు ఆరణి, పులివర్తి



భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, నాని

తిరుపతి (ఆటోనగర్) ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో అనుసరించిన విధానాల వల్ల రాష్ట్రంలో విద్యుత్ సంస్థలు నిర్వీర్యమయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం వాటిని గాడిలో పెడుతోందని తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని పేర్కొన్నారు. పాత తిరుచానూరు రోడ్డులోని పాత డీఈ కార్యాలయ ప్రాంగణంలో రూ.2.08 కోట్లతో నిర్మించిన ఈఈ తిరుపతి టౌన్, రూరల్ కార్యాలయాలను వారు సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం పది పర్యాయాలకు పైగా విద్యుత్ చార్జీలు పెంచి వినియోగదారులపై పెనుభారం మోపిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచకపోగా చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో విద్యుత్ అభివృద్ధి పనులు చేయడం అభినందనీయమన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఎస్ఈ పి.సురేంద్రనాయుడు మాటాడుతూ విద్యుత్ స్తంభాలకు ఉన్న అనధికార కేబుల్స్‌ను తొలగించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేలను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ ఎస్‌కే బాబు, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి, సీజీఎం వరకుమార్, జీఎం నీలం నరేంద్రనాథ్, ఈఈలు వి.చంద్రశేఖరరావు, చిన్నరెడెప్ప, పుల్లా బాలాజీ, డీవైఈఈలు పీ ఆంజనేయులు, కే.మునిప్రసాద్, కే జయప్రకాష్, వి.రమేష్‌బాబు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం జరగాలి...బాధ్యులకు శిక్ష పడాలి

టీడీఆర్ బాండ్ల మేళాను పరిశీలించిన టీడీపీ నేతలు



టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్ వరప్రసాద్‌తో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

తిరుపతి, ఏప్రిల్7(ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్మెంట్ రైట్స్ (టీడీఆర్) బాండ్ల జారీలో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగాలని, కుంభకోణానికి కారణమైన వైసీపీ నేతలు, అధికారులను శిక్షించాలని టీడీపీ నేతలు డిమాండు చేశారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న టీడీఆర్ బాండ్ల జారీ స్పెషల్ డ్రైవ్‌ను యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ ఇతర నాయకులు పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మంగళగిరి నుంచి వచ్చిన టౌన్ ప్లానింగ్ అడిషనల్ డైరెక్టర్ వరప్రసాద్‌తో మాట్లాడారు. నరసింహ యాదవ్ మాట్లాడుతూ తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా రోడ్లు వేశారని ఆరోపించారు. కొన్నిచోట్ల వైసీపీ నాయకుల సొంత ఆస్తుల కోసమే రోడ్లు వేసుకున్నట్టు ఉందన్నారు. రవినాయుడు మాట్లాడుతూ టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో జరిగిన విచారణ నివేదికను బయటపెట్టకుండా, వైసీపీతో అంటకాగే అధికారులపై చర్యలు తీసుకోకుండా చేపడుతున్న టీడీఆర్ బాండ్ల జారీ స్పెషల్ డ్రైవ్‌తో బాధితులకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదన్నారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. ఆర్సీ మునికృష్ణ మాట్లాడుతూ టీడీఆర్ వ్యవహారంలో పాత్రధారులైన అధికారులను విచారణ చేయించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ అభినయ్ నేతృత్వంలోనే టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగిందని, నష్టాన్ని రికవరీ చేయాలని కోరారు. అనంతరం కమిషనర్ మౌర్యను కలిసి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కూడా మరికొంత మంది టీడీపీ నాయకులతో వేరుగా కమిషనర్‌ను కలిసి టీడీఆర్ బాండ్ల కోసం ఎదురుచూస్తున్న బాధితులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ టీడీఆర్ బాండ్ల ఆరోపణలపై విచారణ జరుగుతోందని, నివేదిక వచ్చిన తర్వాత ప్రభుత్వం తగు చర్యలు తీసుకుం టుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు పులుగోరు మురళీకృష్ణారెడ్డి, ఊకా విజయకుమార్, శ్రీధర్‌వర్మ, కుమారమ్మ, బుల్లెట్ రమణ, సూరా సుధాకర్ రెడ్డి, చినబాబు, మహేష్ యాదవ్, కంకణాల రజనీకాంత్, మన్నెం శ్రీనివాసులు, సింగంశెట్టి సుబ్బరామయ్య, కృష్ణ యాదవ్, మునిశేఖర్ రాయల్, హేమంత్ రాయల్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి హుస్సేనమ్మ గంధోత్సవాలు



నెలబల్లి హుస్సేనమ్మ దర్గా

దొరవారిసత్రం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లి వద్ద ఉన్న హుస్సేనమ్మ దర్గాలో ఈనెల 10 నుంచి గంధోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 10, 11, 12 తేదీల్లో మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో మొదటి రోజు గంధం ఊరేగింపు, గ్రామోత్సవం జరుగుతుంది. రెండు, మూడు రోజుల్లో భక్తుల సందర్శన సమయాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపడుతారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. హుస్సేనమ్మ దర్గాను దర్శించుకుంటే కోర్కెలు నెరవేరుతాయని, దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తే పుత్రసంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం. స్థానికులతో పాటు తమిళనాడు నుంచి భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేయనుండడంతో దర్గా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

క్రాస్‌రోడ్డులో తప్పని ట్రాఫిక్ కష్టాలు



క్రాస్ రోడ్డు వద్ద వాహనదారుల ఇబ్బందులు

వెంకటగిరిటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. తిరుపతి, నాయుడుపేట, శ్రీకాళహస్తి, చెన్నై మార్గాల కూడలి ప్రాంతమైన క్రాస్‌రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. గత ఏడాది డిసెంబరు 14వ తేదీన క్రాస్‌రోడ్డు వద్ద పోలేరమ్మ ఆర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నేతృత్వంలో శంకుస్థాపన చేశారు. నిర్మాణం ఆది నుంచి నత్తనడన సాగుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. త్వరగా ఆర్చి నిర్మాణ పనులు ముగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కుల దూషణపై విచారణ



వీరారెడ్డి సత్రంలో సాక్షులను విచారిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

కోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెంకన్నపాళెం పంచాయతీ వీరారెడ్డి సత్రంలో కులదూషణపై సోమవారం డీఎస్పీ గీతాకుమారి బహిరంగ విచారణ చేపట్టారు. రెండు రోజుల క్రితం వీరారెడ్డి సత్రంలో గిరిజనులైన జయమ్మ, ఆమె కుమారుడు నరసింహులను అదే గ్రామానికి చెందిన కుడుముల మస్తానయ్య కులం పేరుతో దూషించి దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు. సోమవారం గూడూరు డీఎస్పీ గీతాకుమారి విచారణ జరిపారు. ఆమె వెంట ఎస్ఐ పవన్ కుమార్ ఉన్నారు.

భూ పరిహారంపై అభ్యంతరాల స్వీకరణ



రైతుల నుంచి అభ్యంతరాలు సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు

కోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కోట తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ భూముల పరిహారానికి సంబంధించి అంభ్యంతరాలు స్వీకరించారు. బాలాయపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, వడమాలపేట డిప్యూటీ తహసీల్దార్ సుధీర్ రెడ్డి, సర్వేయర్ గోపిరెడ్డి, పలువురు వీఆర్వోలు భూములు కోల్పోయిన రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించారు.

20న టెక్ వ్యూహ జాతీయ సదస్సు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ విజయ్‌కుమార్ రెడ్డి, విభాగాదిపతులు

కోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 20వ తేదీన టెక్ వ్యూహ 2025 జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయ్ కుమార్‌రెడ్డి, విభాగాధిపతులు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నారాయణ, డాక్టర్ కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత

గూడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎస్ఐ తిరుపతయ్య అన్నారు. సోమవారం స్థానిక గాయత్రి పాఠశాలలో యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు నైతిక విలువలు, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. శ్రద్ధగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శివకుమార్‌రెడ్డి, శ్రీహరి, మస్తాన్బీ, ఉమామహేశ్వరి, హరిత, జ్యోతి, స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఎస్ఐ తిరుపతయ్య

దొంగతనం కేసులో 6 నెలల జైలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో నిందితుడికి 6 నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ సోమవారం గూడూరు కోర్టులో న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గత ఏడాది ఆగస్టు 25వ తేదీన తాళమ్మగుడి సమీపంలో నివాసం ఉంటున్న సుబ్రహ్మణ్యం తన పొలంలో రాగివైరు, పైపులు దొంగిలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి పట్టణానికి చెందిన శీనయ్య దొంగతనం చేసినట్లు గుర్తించి అరెస్టు చేసి కోర్టులో హాజరపరిచారు. విచారణలో నేరం రుజువుకావడంతో నిందితుడికి 6 నెలలు జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని మోటరు సైక్లిస్టు మృతి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తుమ్మూరు సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో మోటరు సైక్లిస్టు మృతి చెందాడు. అర్బన్ సీఐ బాబి తెలిపిన వివరాల మేరకు... మండలంలోని అయ్యప్పరెడ్డిపాళెం గ్రామానికి చెందిన ఈగ పుల్లయ్య(40) మోటరుసైకిల్‌పై ఆదివారం రాత్రి నాయుడుపేటకు వెళ్తుండగా తుమ్మూరు వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడాడు. 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ పులయ్య మృతి చెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఫ్లెక్సీ చించివేసిన ఇద్దరిపై కేసు

చిల్లకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతవరం గ్రామంలో టీడీపీ నాయకుడు గోను శ్రీనివాసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని చించివేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో తాను ఏర్పాటు చేసిన టీడీపీ ఫ్లెక్సీని అదే గ్రామానికి చెందిన జోగి అంకారావు, చెన్నైకి చెందిన బేదర్ల కృష్ణ చించి వేశారని గోను శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జోగి అంకారావు, బేదర్ల కృష్ణపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.





మన్నెముత్తేరిలో ప్రైవేట్ లే అవుట్‌లో, దావాదిగుంట వద్ద జగనన్న లేఅవుట్ సమీపంలో అవసరం లేని చోట వేసిన సిమెంటు రోడ్లు

అనుమతి ఒకచోట... పనులు మరోచోట

- ఇష్టానుసారంగా పల్లెపండగ పనులు
- అవసరం లేనిచోట సిమెంటు రోడ్లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



ఉగ్గుముడిలో చెరువు కట్ట వద్దకు వేసిన సిమెంటు రోడ్లు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పల్లెలు అభివృద్ధికి దూరమయ్యాయి. కూటమి అధికారంలోకి వచ్చాక పల్లెపండగ పేరుతో పెద్దఎత్తున గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో ఎక్కడా మట్టిరోడ్డు ఉండకూడదనే ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని అవసరమున్నచోట సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందుకోసం ఉపాధి హామీ నిధులు ఖర్చు చేయాలని నిర్దేశించారు. అయితే కొందరు నాయకులు అవసరం లేనిచోట రోడ్లు వేసి బిల్లులు పొందేందుకు పన్నాగం వేశారు. సూళ్లూరుపేట మండలంలోని 19 పంచాయతీలకు పల్లెపండగ కింద తొలివిడత 25 సిమెంటు రోడ్లు మంజూరయ్యాయి. ఇందుకోసం రూ.1.80 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. మళ్లీ అదనంగా 12 సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.56 లక్షలు ఇచ్చింది. తదుపరి రూ.60 లక్షలు ఒక్కసారి, రూ.30 లక్షలు మరోసారి, ఇలా మొత్తం రూ.3.20 కోట్లతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు గ్రామాల్లో పనులు కూడా చకచకా సాగాయి. అయితే పనులు దక్కించుకొన్న నాయకులు అనుమతి ఒకచోట తీసుకొని.. రోడ్ల నిర్మాణాలు మాత్రం మరోచోట చేస్తున్నారు. ప్రైవేట్ లే అవుట్లు, పొలాలు, చెరువు కట్ట తదిర ప్రాంతాల్లో అవసరం లేని చోట్ల నిర్మాణాలు చేపట్టేశారు. సూళ్లూరుపేట మండలం మన్నెముత్తేరిలో మద్దిలేటమ్మ ఆలయం పక్కనే ఉన్న ప్రైవేట్ లేఅవుట్‌కు సిమెంటు రోడ్డు నిర్మించారు. అదేమని ప్రశ్నిస్తే ఎస్సీ కాలనీకి రూ.5 లక్షలతో 150 మీటర్ల సిమెంటు రోడ్డు మంజూరైందని, అక్కడ 100 మీటర్ల రోడ్డు నిర్మించి మిగిలింది లే అవుట్‌కు వేశామని చెబుతున్నారు. అదేవిధంగా ఉగ్గుముడి గ్రామంలో అనుమతి ఒకచోట తీసుకొని చెరువు కట్టకు 50 మీటర్ల మేర సిమెంటు రోడ్డు వేశారు. అలాగే కేసియన్‌గుంట వద్ద రూ.10 లక్షలతో జగనన్న లేఅవుట్‌కు సిమెంటు రోడ్డు వేశారు. ఈ లే అవుట్‌లో ముళ్లపొదలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ఇక్కడ అవసరం లేకపోయిన సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇవన్నీ తెలిసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పౌష్టికాహారం, వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సంయుక్త

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పట్టణంలోని తుమ్మూరు అర్బన్ హెల్త్‌సెంటర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. వైద్యులను న్యాయమూర్తి శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆశ చెంచుకృష్ణయ్య, సీనియర్ న్యాయవాది సోమశేఖర్, న్యాయవాది సుమన్, ఎస్ఐ ఆదిలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

పెళ్లకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూ సంబంధిత సమస్యలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెళ్లకూరు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలపై వీఆర్వోలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల వేదికలో వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి నెంబరు ఇస్తున్నామని చెప్పారు. అనంతరం క్షేత్రస్థాయిలో విచారించి సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామాల్లో కోర్టు కేసులతో పాటు దీర్ఘకాలంగా ఉన్న కుటుంబ వివాదాల కారణంగా భూ సమస్యలు పరిష్కరించేందుకు ఆలస్యమవుతోందన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు రమేష్, వంశీకృష్ణ, తేజ, మోబీనా, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.



వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దారు ద్వారకానాథ్‌రెడ్డి

చెన్నకేశవస్వామి గ్రామోత్సవం



కోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) కోట పట్టణంలోని దళితవాడలో శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున స్వామిఅమ్మవార్ల గ్రామోత్సవం జరిగింది. భక్తులు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

శేషవాహనంపై సంగమేశ్వరుడు



కామాక్షీదేవి, సంగమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలు

కోట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని గూడలిలో వెలసిన కామాక్షీదేవి సమేత సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారు శేష వాహనంపై ఊరేగారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు కామాక్షీదేవి, సంగమేశ్వరుడి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ

వాకాడు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రోగులకు వాకర్స్ అసోషియేషన్ సభ్యులు వైద్యాధికారి రోహిత్ జేమ్స్ చేతల మీదుగా పండ్లు, రొట్టెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు జాలాది కిషోర్ మాట్లాడుతూ... సంపూర్ణ ఆరోగ్యానికి ఆహార అలవాట్లే కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ ఆహారం, తగినంత నీరు తీసుకోవడంతో పాటు వ్యాయామం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జాన్సన్, వాకర్స్ అసోషియేషన్ వైస్ చెర్మన్ రాజకుమార్, ట్రెజరర్ ఠాగూర్, జనరల్ సెక్రటరీ భరత్ మహిపతి, దాతలు సుమన్, సుధాకర్, జిలాని, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వాకర్స్ అసోషియేషన్ సభ్యులు

విద్యార్థులకు వ్యాయామం తప్పనిసరి



విద్యార్థులకు మెడల్స్ అందజేస్తున్న యోగా మాస్టర్ రాజా

గూడూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వ్యాయామం తప్పనిసరిగా ఉండాలని యోగా మాస్టర్ రాజా అన్నారు. సోమవారం స్థానిక స్వర్ణాంధ్రభారతి పాఠశాలలో మేధాశక్తి, శారీరక ప్రవర్తనలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం చేయడం ద్వారా శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంత పొందడంతో పాటు చదువులపై ఏకాగ్రత సాధించవచ్చునన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకో వాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఎంచుకుని వాటిని కష్టపడి చదివి సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ నవకోటి నాయుడు, సునీల్‌రాజ్, హరికృష్ణ, సింధు తదితరులు పాల్గొన్నారు.

రామాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అంకురార్పణ పూజల్లో అర్చకులు

గూడూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో సోమవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి విష్వక్సేనారాధనమ్, పుణ్యాహవాచనమ్, వాస్తుపూజలు జరిపి అంకురార్పణ చేశారు. ఉభయదాతలుగా సురేష్‌బాబు వ్యవహరించారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా

నాయుడుపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీ అనుమతి లేని, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా హెచ్చరించారు. సోమవారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు అక్రమ, అనుమతులు లేని నిర్మాణదారులు 74 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. వీరిలో 26 మంది ఎటువంటి స్పందన లేకపోవడంతో వారిపై కోర్టులో కేసులు దాఖలు వేశామన్నారు. అక్రమ నిర్మాణాల నుంచి దాదాపు రూ.3 కోట్ల పరిహారం మున్సిపాలిటీకి అందనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈ తనిఖీల్లో డీపీవో బాలసుబ్రహ్మణ్యం, ప్లానింగ్ సెక్రటరీ హుమయూన్, శీను తదితరులు పాల్గొన్నారు.

యోగా, వ్యాయామంతో ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

చిల్లకూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ యోగా, వ్యాయామం చేయడంతో పాటు పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండారని డాక్టర్ షాలోమ్ అరాఫత్ అన్నారు. సోమవారం చిల్లకూరు పీహెచ్‌సీలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సి జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ షాలోమ్ మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో ఎక్కువ మంది శుభ్రమైన ఆహారాన్ని తీసుకోకపోవడంతో పాటు యోగా, వ్యాయామాలకు దూరంగా ఉంటూ రోగాల భారీన పడుతున్నారన్నారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది రవికుమార్, లక్ష్మి, గౌరీ, గోపి, పోలమ్మ, షాబీరా, సావిత్రి, కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ



టీడీపీ సభ్యత్వ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను సోమవారం ఎమ్మెల్యే రామకృష్ణ కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వం పొందిన కార్యకర్త ప్రమాదవ శాత్తు మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షలు బీమా అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, బీరం రాజేశ్వరరావు, పునుగోటి విశ్వనాధ నాయుడు, అవ్వారు సత్యనారాయణ, పప్పు చంద్రమౌళి రెడ్డి, ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, బాబు నాయుడు, గడ్డం చంద్రశేఖరరెడ్డి, బొలిగల వెంకటసుబ్బయ్య, రాఘవరెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా విజ్ఞప్తులకు సత్వర పరిష్కారం

డక్కిలి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా విజ్ఞప్తులకు సత్వర పరిష్కారం చూపుతామని తహసీల్దారు శ్రీనివాసులు చెప్పారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో భూ సమస్యలకు సంబంధించి మ్యుటేషన్లు, పట్టాదారు పాసుపుస్తకాల కోసం ఎక్కువగా అర్జీలు అందినట్లు చెప్పారు. అనంతరం వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో తహసీల్దారు సమావేశమై పరిష్కారానికి నోచుకొని సమస్యల గుర్తించి సమీక్షించారు.



ప్రజల నుంచి వినతుల స్వీకరిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

వైభవంగా పంగుణోత్తర ఉత్సవం



నారాయణవనం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కొలువై ఉన్న పద్మావతి సమేత కల్యాణ వెంకన్న ఆలయంలో సోమవారం పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారి ఊంజలసేవను నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు చేశారు. పంగుణోత్తర ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారి ఊంజల నిర్వహించారు. ఆలయాధికారి నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించగా ప్రధాన అర్చకులు శ్రీధర్‌భట్టాచార్యులు పూజలు చేశారు.

శాస్త్రోక్తంగా పెద్దకొట్టాయి ఉత్సవం



జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం పెద్దకొట్టాయి ఉత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ముందుగా ఆలయ అలంకార మండపంలో స్వామిఅమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ఆవరణలోని కోట మండపం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ మూడు ప్రదక్షిణలు చేసి మండపంలో కొలువు దీర్చారు. ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లాడ్జీల్లో ముమ్మరంగా తనిఖీలు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తేరువీధిలో ఉన్న పలు లాడ్జీల్లో పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల తేరువీధిలోని ఓ లాడ్జీలో వ్యభిచారం జరిగిన ఉదంతం వెలుగు చూసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం రాత్రి తేరువీధిలోని పలు లాడ్జీలపై 1టౌన్ సీఐ గోపి సిబ్బందితో కలిసి ఆకస్మికంగా సోదాలు చేశారు.

గుడిమాన్యం కబ్జాపై ఫిర్యాదు



తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం బీరకుప్పం రెవెన్యూ గ్రామ లెక్కదాఖలాల్లో అయ్యావారిగుంత(గుడిమాన్యం)ను ఓ వ్యక్తి కబ్జా చేస్తున్నాడని కలెక్టరేట్ వేదికగా సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో నాగలాపురం మండలం బీరకుప్పానికి చెందిన బలరామన్ ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పటించుకోవడం లేదని పేర్కొన్నారు. కబ్జాదారుడిపై చర్యలు తీసుకుని ప్రజలు, పశువులకు దాహార్తిని తీరుస్తున్న సదరు గుంతను పునరుద్ధరించాలని కోరాడు.

సర్వే నుంచి మినహాయించండి



కమిషనర్‌కు సీపీఐ నాయకుల వినతి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు కోరారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య ఆధ్వర్యంలో సోమవారం పురపాలకసంఘ కమిషనర్ గిరికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గురవయ్య మాట్లాడుతూ సచివాలయ సర్వేల నుంచి జేఎల్ఎం గ్రేడ్-2 ఉద్యోగులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. ఇందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మునిహరికృష్ణ, పవన్ కల్యాణ్, తమీమ్, చాంద్‌బాషా, సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించండి



తహసీల్దార్‌తో సమావేశమైన టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలో భూ సమస్యలను పరిష్కరించాలని టీడీపీ మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడు అధికారులను కోరారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎంపీడీవో సురేంద్రనాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఈ మేరకు వినతి చేశారు. ఈ సందర్భంగా గాలి మురళీనాయుడు మాట్లాడుతూ... మండలంలో ఇసుక, మట్టి మాఫియాను అరికట్టాలని కోరానన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరగా అధికారులు పరిష్కరిస్తామని చెప్పారన్నారు.

పుత్తూరు వార్తలు

పాఠ్య పుస్తకాల పంపిణీ



పుత్తూరు, ఏప్రెల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సోమవారం పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు హాజరు కాని విద్యార్థులు కూడా పుస్తకాలను తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఏకాంబరాచారి, నిరంజన్, అమ్ముదేవి, రమాదేవి, సునీతలు పాల్గొన్నారు.

పూడి రైల్వే గేటు మూసివేత



వడమాలపేట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): వడమాలపేటకు సమీపంలోని పూడి రైల్వే గేటు మరమ్మతుల కారణంగా రెండు రోజులు పాటు రాత్రి సమయాల్లో మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. మంగళవారం, బుధవారం రాత్రివేళల్లో 8 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమే మూసివేస్తున్నట్లు తెలిఆపరు. పగలు యాథావిధిగా రాకపోకలు సాగుతాయన్నారు. వడమాలపేట నుంచి పూడి మీదుగా తిరుచానూరు, పత్తిపుత్తూరు అప్పలాయగుంటలకు వెళ్లే ప్రయాణికులు గమనించాలని కోరారు. ప్రస్తుతం రైళ్ల వేగం పెంచడంతో రైల్వే గేటుతో పాటు క్రాసింగ్‌ల వద్ద మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. ఈనెల 10న గురువారం ఉదయం నుంచి యథావిధిగా గేటు పనిచేస్తుందని తెలిపారు.

మండల అభివృద్ధిపై ఎంపీపీ వినతి

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండల అభివృద్ధి పనులపై తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్‌ను పుత్తూరు ఎంపీపీ మునివేలమ్మ మర్యాదపూర్వకంగా కలిసి వినతిత్రం అందించారు. నిధులు నిరుపయోగంగా ఉన్నాయని, కాలయాపన లేకుండా వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. అలాగే మండలస్థాయి అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆమెతో పాటు కోఆప్షన్ సభ్యుడు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండూరులో ఉన్న కోదండరామాలయంలో నవమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సీతారాముల కల్యాణోత్సవం నేత్రపర్వంగా సాగింది. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ధర్మకర్త పరంధామరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

రాకపోకలకు ప్రయాణికుల ఇబ్బంది



భేరివారి మండపం వద్ద ఆగిన ప్రైవేటు ట్రావెల్ బస్సు - వాహనం వెనుక స్తంభించిన వాహనాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రైవేటు వాహనాలతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడంలేదు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ప్రజలను తీవ్రంగా వెంటాడుతున్న విషయం తెలిసిందే. అయితే ప్రైవేటు వాహనాలతో ఈ సమస్య మరింత జటిలంగా మారుతోంది. పట్టణంలోని ప్రధాన ప్రాంతాల్లోకి రద్దీ వేళల్లో భారీ వాహనాలను అనుమతిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అత్యంత రద్దీ రోడ్లపై లగేజీ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ ఆపి సరుకులు దింపుతుండడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు ఎక్కడా ఎక్కువ సమయం నిలపకుండా సాఫీగా సాగిపోతున్నాయి. కానీ కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. అత్యంత రద్దీ కూడలిలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను ఆపి ప్రయాణికులను ఎక్కించుకోవడం, దించుతున్నాయి. దీంతో ఆయా కూడళ్లలో రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఎన్టీఆర్, ఆర్టీసీ కూడళ్లు, బస్టాండు రోడ్డులో ప్రైవేటు బస్సులు, పరిశ్రమలకు చెందిన బస్సులు నడిరోడ్లపై చాలా సేపు తిష్ఠ వేస్తున్నాయి. ఇక ముక్కంటి ఆలయ రాజగోపురం వద్ద చాలా తీవ్రస్థాయిలో ట్రాఫిక్ సమస్య ఎదరవుతోంది. అంతటి కీలకమైన చోట ఆర్టీసీ బస్సులను సైతం అధికారులు 30 సెకన్లకు మించి అనుమతించరు. అలాంటి అదే స్థానంలో ఓ ప్రైవేటు ట్రావెల్స్ సంస్థ రోజుకు 11 ట్రిప్పులు తిరుగుతాయి. 11 సార్లు ప్రతి దఫా అరగంట పాటు రాజగోపురం ముందే బస్సును ఉంచి ప్రయాణికులను ఎక్కించుకుంటారు. ఓ వైపు ట్రాఫిక్ సమస్య ఇబ్బంది పడుతున్నా ప్రైవేటు వాహనాలకు మాత్రం రెడ్‌కార్పెట్ వేస్తుండ టంపై పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ పబ్లిక్‌స్కూల్‌లో సోమవారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ చెవిరెడ్డి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎస్వీ స్కూల్ విద్యార్థి



పతకాలతో ఎస్వీ స్కూల్ విద్యార్థులు

రేణిగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కిక్ బాక్సింగ్‌లో రేణిగుంట ఎస్వీ స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. సోమవారం కర్నూలులో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో ధీరజ్ బంగారు పతకాన్ని, లవకుమార్ రజత పతకాన్ని, చైతన్య కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇందులో బంగారు పతకాన్ని సాధించిన ధీరజ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు స్కూల్ కరస్పాండెంట్ స్ఫూర్తి చెప్పారు.

సీఎం కార్యదర్శికి ఘనస్వాగతం

రేణిగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కార్యదర్శి కార్తికేయ మిశ్రాకు ఘనస్వాగతం లభించింది. సోమవారం మధ్యాహ్నం విజయవాడ నుంచిఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి, తహసీల్దార్ సురేష్‌బాబు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన శ్రీకాళహస్తికి వెళ్లారు.

ముక్కంటి సేవలో సినీ కెమెరామన్ తిరునావుక్కరసు



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం ప్రముఖ సినీ కెమెరామన్ తిరునావుక్కరసు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. కాగా ఈయన గేమ్‌చేంజర్, జనతా గ్యారేజీ, సికిందర్‌కు కెమెరామన్‌గా పనిచేశారు.

వేరుశనగలో క్షేత్రస్థాయి పరిశీలన

కేవీబీపురం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రాస్ కేవీకే సంస్థ శాస్త్రవేత్తలు చెప్పారు. మండలంలోని కొత్తూరు, రాగిగుంటల్లో సంస్థ పంపిణీ చేసిన కె6 వేరుశనగ విత్తిన పంట ప్రదర్శనను శాస్త్రవేత్త శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండున్నర ఎకరాలకు సుమారు 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడికి అవకాశం ఉందన్నారు. శాస్త్రవేత్తలు విద్య, రాంకుమార్, నితిన్ పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపండి



ఇరుగళంలో సమావేశమైన రైతులు

వరదయ్యపాళెం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పరిధిలోని ఇరుగళం, కొల్లడం, పెద్దఈటీపాకం, రాళ్లకుప్పంలలో ప్రభుత్వం ఏపీఐఐసీ ద్వారా చేస్తున్న భూసేకరణను ఆపాలని రైతులు కోరారు. ఆయా గ్రామాల రైతులు సోమవారం ఇరుగళంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీసిటీ ఏర్పాటు సమయంలో తొలి దశలో ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో ఇంకా 40 శాతం ఖాళీగా ఉన్నాయన్నారు. మళ్లీ భూసేకరణ ఎందుకని ప్రశ్నించారు. తమ భూముల్లో సెంటు కూడా ఏపీఐఐసీకి ఇచ్చేది లేదంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు శ్రీరామచంద్రారెడ్డి, విజయశంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బాలాజీరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుశీల్‌కుమార్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బాలసుందరం రెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ



బీఎన్‌కండ్రిగలో వైద్యసిబ్బంది ర్యాలీ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సోమవారం బీఎన్‌కండ్రిగలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాధవి మాట్లాడుతూ... ఆరోగ్యంగా ఉండాలంటే మద్యపానం, పొగతాగడం మానుకోవాలన్నారు. ఉప్పు వినియోగాన్ని తగ్గించాలన్నారు. అధిక బరువు ప్రాణానికి ముప్పని తెలిపారు. డాక్టర్ విద్యాసాగర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు సహా సిబ్బంది పాల్గొన్నారు.

వరదయ్యపాళెం(ఆంధ్రజ్యోతి): మహిళలు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సత్యవేడు మండలం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అరుణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజా ఆరోగ్యానికి మూల స్తంభం తల్లీబిడ్డ సంరక్షణ అన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీహెచ్‌ఈవో సుబ్రహ్మణ్యం, సూపర్‌వైజర్ నాగజ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ మురళి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ జబ్బర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎస్ఎంలు ఆశ వర్కర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ఆదిమూలం పుట్టినరోజు వేడుకలు



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పిచ్చాటూరు నాయకులు

పిచ్చాటూరు, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఎమ్మెల్యే ఆదిమూలం పుట్టిన రోజు వేడుకలను ఆయన సమక్షంలో ఘనంగా నిర్వహించారు. 50 కిలోల కేక్‌ని ఎమ్మెల్యేతో కట్ చేయించి పంచి పెట్టారు. ఏఎంసీ మాజీ ఛైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, సాగు నీటి సంఘ అధ్యక్షులు రవిరెడ్డి, పద్దురాజు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పిచ్చాటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తిరుపతి రుయా ఆస్పత్రి బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు.

- వరదయ్యపాళెం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి దశరథన్, ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి తదితరులు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.
- బుచ్చినాయుడుకండ్రిగ పట్టణంలోని బస్టాండ్ దగ్గర టీడీపీ జిల్లా కార్యదర్శి రవినాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అన్నదానం చేశారు. కేవీబీపురం పట్టణంలో కూడా వేడుకలు జరిగాయి.
- నారాయణవనం పట్టణంలోజరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిమూలం పాల్గొన్నారు. మాజీ ఎంపీపీలు గోవిందస్వామి, ఏపీ భక్తవత్సలం, నాగాలపురం మండల టీడీపీ అధ్యక్షులు శ్రీనివాస యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై అలసత్వం వహించకండి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై వీఆర్వోలు, అధికారులు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ శ్రీదేవి హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు ఇచ్చిన అర్జీలకు వారం రోజుల్లో పరిష్కారం చూపాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలో భూ సమస్యలపై వీఆర్వోలు నివేదికలు ఇవ్వాలన్నారు. ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఏవో భారతి, ఎంఈవో రవీంద్రనాథ్, డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

రేణిగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చైల్డ్ ఫండ్ రాస్ ఆధ్వర్యంలో వైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. సోమవారం మండల పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో ప్రపంచ ఆరోగ్య దినాన్ని పురస్కరించుకుని కాలనీ వాసుల కోసం శిబిరాన్ని నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్ రెడ్డి, డాక్టర్లు ప్రవంతి, అనంత్, రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాతుల వ్యాపారిపై కత్తితో దాడి

రేణిగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బాతుల వ్యాపారిపై కత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం సాయంత్రం గురవరాజుపల్లి వద్ద జరిగింది. రేణిగుంట అర్బన్ పోలీసులు తెలిపిన వివరాలు... రేణిగుంట పట్టణంలోని వేణుగోపాలపురానికి చెందిన దేవరాజ్ బాతుల వ్యాపారం ముగించుకొని ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యంలో చెంగారెడ్డిపల్లికి చెందిన నితిన్, అతని స్నేహితులు దేవరాజ్ వాహనాన్ని ఆపి కత్తితో దాడి చేశారు. వారి నుంచి తప్పించుకుని ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. అనంతరం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సీఐ శరత్ చంద్ర కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడిపై కర్రతో...



గాయాలతో వెంకటసుబ్బయ్య

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో వృద్ధునిపై దాడి జరిగింది. ఈ ఘటన తొట్టంబేడు మండలం పిల్లమేడులో సోమవారం జరిగింది. పిల్లమేడుకు చెందిన వెంకట సుబ్బయ్య (65) రైతు. ఈయనకు సమీప బంధువు కుటుంబంతో గత కొద్ది నెలలుగా భూ వివాదం ఉంది. ఈ క్రమంలో సోమవారం భూ సర్వే పనులు చేపట్టారు. ఈ సమయంలో వెంకట సుబ్బయ్యపై అవతలి వర్గం వారు కర్రతో దాడి చేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం వృద్ధుడు శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చేరాడు.

శ్రీసిటీలో కంటైనర్ లారీ బోల్తా



వరదయ్యపాళెం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ హైటెక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సమవారం లాంగ్ ఫిట్ కంటైనర్ లారీ బోల్తా పడింది. కోబెల్కో సర్కిల్ వద్ద ఈ ఘటన జరిగింది. సమాచారం అందుకున్న శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. వేగంగా వాహనం నడపడం కారణంగా బోల్తా పడినట్లు సెక్యూరిటీ సిబ్బంది చెప్పారు.

రేణిగుంట రైల్వే ఐపీఎఫ్ బదిలీ

రేణిగుంట, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ (ఐపీఎఫ్) సందీప్‌కుమార్ తిరుపతి రైల్వేస్టేషన్‌కు బదిలీ అయ్యారు. సోమవారం రేణిగుంట రైల్వే కల్యాణ మండపంలో సందీప్‌కుమార్ బదిలీ అయిన సందర్భంగా వివిధ శాఖలోని రైల్వే ఉద్యోగులు, టాక్సీ స్టాండ్ అసోసియేషన్ సభ్యులు. రైల్వే కూలీలు, పోర్టర్లు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఐపీఎఫ్ మధుసూదన్, సర్పంచ్ నాగేశం తదితరులు పాల్గొన్నారు.